క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో సర్పంచ్ నిర్లక్ష్యం

● జీపీ ఎదుట గ్రామస్తుల ఆందోళన

భీమదేవరపల్లి : అభివృద్ధి పనుల్లో సర్పంచ్ వల్లెపు అనిత నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపిస్తూ విశ్వనాథకాలనీ ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడగా అభివృద్ధి చెందుతుందని ఆశపడ్డామని చెప్పారు. కాగా ఇప్పటికీ విశ్వనాథకాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేయడం లేదని వివరించారు. జీపీ భవన నిర్మాణంతోపాటు మురికి కాలువలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సర్పంచ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దామెర : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలైన ఘటన మండలంలోని దుర్గంపేట్ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. 108 సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. దుర్గంపేట్‌కు చెందిన చిల్ల సంపత్ (20), మోతె సంతోష్ గూడెప్పాడ్ నుంచి దుర్గంపేట్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా హనుమకొండ వైపు నుంచి గూడెప్పాడ్‌కు వెళ్తున్న కారు ఊరుగొండ సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సంపత్‌కు కాళ్లు, చేతులు విరగ్గా సంతోష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 వాహన సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ సాంబమూర్తి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి సంపత్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి, సంతోష్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంపత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దామెర ఇన్‌చార్జ్ ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించినట్లు సమాచారం.

స్నేహితుడికి ఆర్థికసాయం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన చంద దేవేందర్‌కు అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు శనివారం రూ.30 వేలు సాయం అందించారు. దేవేందర్ తండ్రి బుచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతడి మిత్రులు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. తొలుత బుచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాయం అందించారు. కార్యక్రమంలో దాసి శ్రావణ్ కుమార్, కోగిల సుమన్, కొండ కిరణ్, నాగెల్లి నాగరాజు, రంగు రాజేష్, మంద రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ



శాయంపేట : మండలంలోని వసంతపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాపారావు తండ్రి రాజేశ్వర్‌రావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామశెట్టి లత లక్ష్మారెడ్డి, సర్పంచ్ ముక్కెర అనూష ప్రేమ్‌సాగర్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దేవనాడి మల్లాజీ, మాజీ ఎంపీటీసీ కోసరి గోపాల్, ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మస్తాన్, బాపూరావు, రాజు, దేవేంద్రచారీ పాల్గొన్నారు.

భీమదేవరపల్లి : మండలంలోని కొత్తపల్లికి చెందిన అమృతమ్మ, కుమారస్వామి ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ ఉన్నారు.

మంగళపల్లిలో..

మండలంలోని మంగళపల్లికి చెందిన సయ్యద్ హైదర్, బోనగిరి ఆగమ్మ, బొల్లొనిపల్లికి చెందిన బొల్లి లచ్చమ్మ వేర్వేరు కారణాలతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఊసకోయిల ప్రకాశ్, వలి మహ్మద్ ఉన్నారు.

విమర్శనాత్మక ధోరణి అలవర్చుకోవాలి

హసన్‌పర్తి: విద్యార్థులు విమర్శనాత్మక ధోరణిని అలవర్చుకోవాలని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. వరంగల్ కిట్స్‌లో లిటరరీ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సు శనివారం ప్రారంభమైంది. 'మోడల్ యునైటెడ్ నేషన్స్-23' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ నిరంజన్‌రెడ్డి, ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ నర్సింహరావు, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

రబీ సాగు ఆశాజనకం

● పచ్చదనంతో నిండుకున్న పంట పొలాలు



పచ్చదనంతో నిండిన వరిపైరు

ఎల్కతుర్తి : రైతన్నకు గత రబీ సీజన్‌లో కాలం కలిసి రాక పంట దిగుబడి తగ్గి పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాని దుస్థితి తెలిసిందే. అయినా మండల రైతులు అధైర్యపడకుండా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలో ఆశించిన మేరకు దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులు ఉత్సాహంతో తిరిగి రబీ సాగు చేపట్టారు. మండలంలో 20 వేల హెక్టార్ల వ్యవసాయ భూములుండగా ఈ ఏడాది రబీలో 17 వేల ఎక్టార్లలో వరి సాగు నమోదు కాగా 450 హెక్టార్లలో మొక్కజొన్న, మిగతా భూమిలో మిర్చి, ఇతర పంటలు సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ముందుగా వేసిన వరిచేళల్లో రైతులు కూలీలతో కలుపు తీయిస్తున్నారు. కొందరు వరి పైరుకు కాంప్లెక్స్ ఎరువులు చల్లుతున్నారు. ఇంకొందరు వరి పంటలకు చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టారు. దండేపల్లి, వీర్‌నారాయణపూర్, సూరారం, ఎల్కతుర్తి, బావుపేట, తిమ్మాపూర్, కేశవాపూర్ గ్రామాల్లోని వ్యవసాయ భూములు ఎస్సారెస్పీ ప్రధాన కాలువ కింద, మిగతా గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉన్నాయి. రైతులు వ్యవసాయ బావులతోపాటు బోరుబావులు, చెరువు నీరు, దేవాదుల కాలువ నీటిపై ఆధారపడి సాగు చేస్తారు. రైతులు రబీలో 100 శాతం వరి పంట సాగు చేశారు. వ్యవసాయ బావుల కింది రైతులు ముందుగా వేసిన వరి పంటలో ప్రస్తుతం కూలీల సాయంతో కలుపు తీయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వేసిన వరినాట్లకు జింక్ లోపం, సల్ఫేట్ ఇంజూరీ ఉన్నట్లు అధికారులు ఇటీవల గుర్తించారు. దీన్ని నివారించేందుకు వ్యవసాయ అధికారుల సూచన మేరకు రైతులు మందులు పిచికారి చేయడంతో ఆ పంటలు సైతం పచ్చదనంతో నిండుకొని ఆశాజనకంగా మారాయి.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

వరి పంటలో రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల చీడపీడలు సైతం తక్కువ స్థాయిలో ఆశిస్తాయి. చౌడు నేలలో వారం వ్యవధిలో రెండు సార్లు జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి.

-రాజ్‌కుమార్, ఏఓ, ఎల్కతుర్తి

ప్రతిఒక్కరికీ క్షమాగుణం అవసరం

● పరకాల ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షాలిని లింగం



మాట్లాడుతున్న జడ్జి షాలినీ లింగం

పరకాల : సమాజంలోని ప్రతిఒక్కరికీ క్షమాగుణం ఉండాల్సిన అవసరం ఉందని పరకాల ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షాలిని లింగం ఆకాంక్షించారు. స్థానిక న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 210 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి షాలిని లింగం మాట్లాడారు. తగదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కక్షలతో సాధించేదేమీ ఉండదని, కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అవకాశమున్న కేసుల్లో రాజీపడడం ద్వారా శాంతియుత జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధిర, ఏజీపీ పెండెల భద్రయ్య, లోక్ అదాలత్ సభ్యులు పి.వెంకటరమణ, న్యాయవాదులు ఓంటేరు రాజమౌళి, బందెల స్వామి, దొగ్గెల రమేష్, పి.వేణు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారీ



మాట్లాడుతున్న డీసీపీ ఎంఏ.బారీ

భీమదేవరపల్లి : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారీ తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం కలుగుతాయని చెప్పారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం ఉన్నా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో రాణించలేకపోతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, తరచూ క్రీడాపోటీలు నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులను కోరారు. జెడ్పీటీసీ వంగ రవి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. కేవలం క్రికెటే కాకుండా కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో లాంటి క్రీడల్లో సైతం రాణించాలని చెప్పారు. కార్యక్రమంలో ముల్కనూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మార్పాటి మహేందర్‌రెడ్డి, రైతుబంధు కమిటీ ముల్కనూర్ కోఆర్డినేటర్ దార్న శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయులు పచ్చునూరి కరుణాకర్, రాజేశ్వరి, చంటి, రాజ్‌కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్ర పురోగతి

● మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య



పూజలు చేస్తున్న రాజయ్య, వెంకట్రాంరెడ్డి

ఆత్మకూరు : కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం పురోగతి సాధించిందని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తెలిపారు. మండలంలోని అగ్రంపహాడ్‌లో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డితో కలిసి సమ్మక్క-సారలమ్మలకు శనివారం పూజలు చేసి హాథ్ సే హాథ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం మండలంలోని కటాక్షపూర్ నుంచి హౌజుబుజుర్గు గ్రామం వరకు పాదయాత్ర చేపట్టారు. వెంకట్రామ్‌రెడ్డి గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ చరిత్ర, బీఆర్‌ఎస్ లోపాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.కాంగ్రెస్ హయాంలోనే పేద ప్రజలకు మంచి జరిగిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేసీఆర్ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చెప్పారు. అనంతరం ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు పర్వతగిరి రాజు, పూజారి రాము, ముద్దం సాంబయ్య, బోరిగం స్వామి, తిరుపతి, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా మధుకర్‌రావు



శాయంపేట : మండలంలోని రాజపల్లి గ్రామ బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షుడిగా సిద్దూరి మధుకర్ రావును స్థానిక సర్పంచ్ గజ్జెల లావణ్య రాజు గ్రామ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మధుకర్‌రావును చైర్‌పర్సన్ జ్యోతి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ మహేందర్, వార్డు సభ్యులు రాజు, తిరుపతిరావు, కుమార్, రాజేశ్వర్‌రావు, నాయకులు రాజు, ఐలోని మాధవరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు పూజారి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఐనవోలు : ఐనవోలు ఆలయ ఒగ్గు పూజారి మజ్జిగ వెంకటనర్సు మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటనర్సు మృతిదేహాన్ని ఒగ్గు, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంగ బీరయ్య, ఓదెలుతో కలిసి లింగయ్య శనివారం సందర్శించి మాట్లాడారు. వెంకటనర్సు మృతిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, రాజు, యాకయ్య, నారాయణ తదితరులున్నారు.

ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేకం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గోవర్ధన రాఘవాచార్యుల బృందం ఆధ్వర్యంలో అష్టోత్తర శతఘటాభిషేకం, సుదర్శన నారసింహ హవనం, శాంతికల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తొలుత 108 కలశాలలో సుగంధ, పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు నింపారు. అనంతరం వేద మంత్రాలతో కలశస్థాపన చేసి మూలమూర్తి, మూలవిరాట్‌లను అభిషేకించారు. సుదర్శన నారసింహ హవనం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. లక్ష్మీనృసింహ స్వామికి శేషవాహనంపై శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవాచార్యులు మాట్లాడారు. ఆత్మకూరు వంశస్తుల అభీష్టం మేరకు ఆలయంలో ఏడాది మొత్తంలో జరిగే లోపాలు నివృత్తి కావడంతోపాటు స్వామి వారు శాంతించేలా కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం అద్దంకి సాయి సహస్ర ఆధ్వర్యంలో 800 మందికి మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జయ కృష్ణమాచార్యులు, ఎంపీపీ మార్నేని మధుమతి, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాం పాండురంగం, మునిగాల సంపత్‌కుమార్, పోలెపల్లి శంకర్‌రెడ్డి, ఆడెపు దయాకర్, అర్ధగూడి సతీష్, కంజర్ల రమేష్, బొల్లం ప్రకాశ్, ఆకుతోట యాకయ్య, అరూరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే మూగజీవాల రక్షణ



పశువులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దీపిక

దామెర : పశువులకు వచ్చే రోగాల పట్ల అవగాహన కలిగి ఉండడం ద్వారా వాటిని సంరక్షించుకోవచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ దీపిక తెలిపారు. మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో వెటనోవా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పశు వైద్య శిబిరాలను పశు పోషకులు, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూగ జీవాలకు సోకే రోగాలు, సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యవంతం కావాలని చెప్పారు. పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉంటూ సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, తోట శ్రీనివాస్, కిషన్, జేవీఓ రవి, శంకర్, పశుమిత్ర సరిత పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి



డైరీ ఆవిష్కరిస్తున్న గండ్ర జ్యోతి, తదితరులు

కాజీపేట రూరల్: రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి అన్నారు. మడికొండలోని రెడ్డి సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ, సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెపల్లిలో నిర్వహిస్తున్న హాస్టల్‌లో ఎక్కువ మందికి వసతి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నివేదికలను సంఘం సహాయ కార్యదర్శి చందుపట్ల సత్యనారాయణరెడ్డి, కోశాధికారి చాడా సునీల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్, సంఘం ఉపాధ్యక్షుడు ముద్దసాని పద్మనాభరెడ్డి, కార్పొరేటర్ చాడా స్వాతి, పూర్వ అధ్యక్షుడు కె.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ కొండపల్లి సుధాకర్‌రెడ్డి, కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, వెంకట మల్లారెడ్డి, దుబ్బాక హేమ, టి.జనార్దన్‌రెడ్డి, కోమండ్ల రాంరెడ్డి, కుందూరు రమేష్‌రెడ్డి, కట్కూరి దేవేందర్ రెడ్డి, దొంతి రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, కన్నారెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దస్రునాయక్

ఖిలా వరంగల్: ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా దస్రునాయక్ డిమాండ్ చేశారు. గిరిజన సమాఖ్య ఏర్పడి 19ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో భూక్య శివరామకృష్ణ అధ్యక్షతన గిరిజన సమాఖ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దస్రునాయక్ మాట్లాడుతూ గిరిజనులకు దామాషా ప్రకారం 10శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజన బంధును ఈబడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు దీవిక, లలిత, లక్ష్మి, స్వప్న, ఎల్లమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

● ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి



పరకాల : మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి



దామెర : మాట్లాడుతున్న మేఘనాథ్

పరకాల : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలోని పట్టణాల్లో, పల్లెల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తెలిపారు. పట్టణంలోని 36, 37, 45 బూత్‌ల పరిధిలోని దామెర చెరువు గుడి శక్తి కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పురుషోత్తం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా భిక్షపతి హాజరై మాట్లాడారు. పల్లెల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, ఎల్‌ఈడీ లైట్లు, రైతు వేదికలు, వైకుంఠ ధామాలు, ఇతర అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేపట్టారని తెలిపారు. అనంతరం ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, హుస్నాబాద్ అసెంబ్లీ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ మాట్లాడారు. పార్లమెంట్‌లో బీజేపీ మద్దతు తెలపడం వల్లే తెలంగాణ ఏర్పాడిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, మండల ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, 9వ వార్డు కమిటీ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వర్లు, నాయకులు దేవేందర్, సంగ నరేష్ పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో, చౌటుపర్తి గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పరకాల మాజీ ఎమ్మెల్యే భిక్షపతి మాట్లాడారు. పరకాల నియోజకవర్గంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో జెండా ఎగరేయాలి

దామెర : రానున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయాలని కొత్తగూడెం ప్రభాహరి దేవునూరు మేఘనాథ్ కోరారు. మండలంలోని కోగిల్వాయి శక్తి కేంద్రం 77, 78 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఆ పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా మేఘనాథ్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయచందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. సమావేశంలో పార్టీ బూత్ ఇన్‌చార్జ్ కొండి ప్రేమ్‌కుమార్, కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, జిల్లా నాయకులు గంకిడి బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్‌కుమార్, బీజేవైఎం నాయకుడు సూర చందర్, పెంచాల జగన్, పిట్టల రమేష్, చుక్క మహేందర్, రాజేందర్, పాలకుర్తి శ్రీలత, ఎక్కలదేవి రమేష్, మందాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్.. కార్మికుల పక్షపాతి

హన్మకొండ: సీఎం కేసీఆర్‌ను కార్మికుల పక్షపాతిగా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (బీఎస్‌ఆర్‌కేఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేషం, లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ పెద్ది రఘుపతిరెడ్డి అభివర్ణించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్మిక భవనం ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆ సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హనుమకొండ వడ్డెపల్లి చర్చి కూడలిలో కేసీఆర్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు కార్మికులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికుల ఇతర సమస్యలను సైతం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సాదిక్ అలీ, భిక్షపతి, శివన్న, కొండయ్య, సుధాకర్, కృష్ణయ్య, లింగయ్య, రాజు, శ్రీను, అనసూర్య, లలిత పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే కీలకం



మాట్లాడుతున్న ఏసీపీ, అసిస్టెంట్ కమాండెంట్



కవాతు చేస్తున్న ఆర్‌ఏఎఫ్ సిబ్బంది

● వరంగల్ ఏసీపీ బోనాల కిషన్

ఖిలా వరంగల్: దేశ, రాష్ట్ర అంతర్గత భద్రతలతోపాటు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో సీఆర్‌పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) అత్యంత కీలకమని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, 19వ ఆర్‌ఏఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జితేంద్రనందవాల్ అన్నారు. ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఆర్‌ఏఎఫ్ పోలీసులు ఆయుధాలు పట్టి కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్‌ఏఎఫ్ 19వ బెటాలియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ నేతృత్వంలో రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంగణం నుంచి కరీమాబాద్ ఉర్సు దర్గా మీదుగా అండర్ బ్రిడ్జి వరకు నాలుగు కిలోమీటర్ల మేర 74మంది ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఆధునాతన ఆయుధాలు చేత పట్టి శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్, జితేంద్రనందవాల్ మాట్లాడుతూ ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఎస్సైలు శ్రీలత, రాజేందర్, కుమార్, సుమన్, ఆర్‌ఏఎఫ్ సిబ్బంది, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ ఎంఏ. జబ్బార్, కార్పొరేటర్ మరుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కాజీపేట: తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి ఓవర్‌హెడ్ ట్యాంక్ ఎదుట బీజేపీ నాయకులు శనివారం ఆందోళన చేశారు. పది రోజులుగా నల్లాల ద్వారా తాగునీరు రాకపోవడాన్ని నిరసిస్తూ ప్రధాన గేట్ వద్ద పట్టణ బీజేపీ నాయకులు బైఠాయించారు. వెంటనే తాగునీరు సరఫరా చేయాలని నినాదాలు చేశారు. ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రావు అమరేందర్ రెడ్డి, నార్లగిరి రామలింగం, కుమారస్వామి, ఎండి.చాంద్‌పాషా, రాజ మహేంద్రన్, కె.సారయ్య తదితరులు పాల్గొన్నారు.